## క్లుప్తంగా

### ఘనంగా దుర్గమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, గొర్లె చందు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి జాతరను ఆలయ ఉత్సవ కమిటీ నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 గ్రామాల ఇలవేల్పుగా కొలిచే దుర్గమ్మను భక్తులు వేకువజాము నుంచే దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు గొర్లె చందు, వి.భరత్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు నడుమ ఉత్సవం జరిపించారు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సురేష్‌బాబు, ఎల్.కృష్ణ, రవి, ఎం.శ్రీను, కాశీ, ఆర్.శ్రీను, వెంకటరమణ, వినయ్, తరుణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### బాటసారులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ



వాటర్ బాటిల్, మజ్జిగ ప్యాకెట్ అందిస్తున్న డాక్టర్ పైడి రమణమూర్తి

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ సంస్థ ఆధ్వర్యంలో బిర్లా కూడలిలో ఆదివారం చలివేంద్రం నిర్వహించారు. బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. బస్సులు, ఆటోల్లో ప్రయాణికులకు వాటిని అందించారు. మానవ సేవే మాధవ సేవ అధ్యక్షుడు సనపల సీతారామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళ ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి రమణమూర్తి బాటసారులకు 1,500 మజ్జిగ ప్యాకెట్లు, వెయ్యి వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని డాక్టర్ పైడి రమణమూర్తి అందించారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, ఉపాధ్యక్షులు పి.గిరిధర్, డి.వరప్రసాద్, కార్యదర్శి వై.త్రిమూర్తి, ఉప కార్యదర్శులు పి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాస్, కోశాధికారి కేవీ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బి.వెంకటరమణ, కె.భవాని శంకర్, ఎస్.ప్రకాశరావు, పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని సూచించారు. హద్దు మీరితే ఉపేక్షించేది లేదని వారిని సీఐ హెచ్చరించారు.

### ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం ర్యాలీ, సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామాటాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది.

# సాహిత్యం.. జనహితం



పద్య పఠనం చేస్తున్న విద్యార్థులు

- ప్రజా చైతన్యమే ఆశయంగా సాహితీ స్రవంతి సంస్థ కార్యక్రమాలు
- సాహిత్యం, కవిత్వం ద్వారా ప్రజా ఉద్యమాలకు ఊతం
- తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి

**ఆశయాలు**

సాహిత్యాన్ని కుల, మతాతీతంగా ప్రజా బాహుళ్యంలోకి తీసువెళ్లి ప్రయోజనకారిగా తీర్చిదిద్దడం, సమాజ హితం కోసం సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించి ప్రజా చైతన్యాన్ని తీసుకురావడమే ఆశయంగా సంస్థ పనిచేస్తోంది. దీనికి అనుబంధంగా సాహిత్య ప్రస్థానం మాస పత్రికను నిర్వహిస్తూ ప్రజల్లో భాషపై ఆసక్తిని కలిగిస్తున్నారు. దీనికి మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

**తెలుగు భాషా వ్యాప్తికి కృషి**

తెలుగు భాషపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. కాలేజీలు, పాఠశాలల్లో తెలుగు భాష, పద్యం, కవిత్వం, సాహిత్యం వంటి అంశాలపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు పద్య పఠనంపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి తెలుగు భాషాభిమానాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారు. వేమన, సుమతీ శతకాలు, కరుణశ్రీ, జంధ్యాల పాపయ్య శాస్త్రి పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నారు.



తెలుగు భాషా ప్రాధాన్యం గురించి చిన్నారులకు వివరిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధి



పోటీలో పద్యం పఠిస్తున్న విద్యార్థిని

మురళీనగర్: సాహితీ స్రవంతి.. సాహితీ సేవా సంస్థ మాత్రమే కాదు. ప్రజా చైతన్య వేదిక కూడా. సాహిత్యం మాధ్యమంగా ప్రజా చైతన్యాన్ని తీసుకొస్తున్న సంస్థ. తెలుగు భాషకు ప్రాధాన్యం కల్పించడంతోపాటు సాహిత్యం, కవిత్వం ద్వారా ప్రజా ఉద్యమాలకు తమ వంతుగా ఊతమివ్వడం, సాహిత్యం ద్వారా లౌకికతతను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆశయంగా పనిచేస్తోంది. ప్రజల్లో భాషాభిమానాన్ని పాదుకొల్పుతోంది.

**1998లో సంస్థ ఏర్పాటు**

రచయిత, విశ్లేషకుడు తెలకలపల్లి రవి 1998లో సాహితీ స్రవంతి సంస్థను ప్రారంభించారు. విశాఖ జిల్లా శాఖకు రమణాచారి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేయగా.. తర్వాతి కాలంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.రమణారావు, నూనెల శ్రీనివాసరావు సాహితి స్రవంతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. వీరిరువురి సారథ్యంలో 2015, 2017ల్లో పది రోజుల పాటు నిర్వహించిన వైజాగ్ ఫెస్ట్ నభూతో నభవిష్యతిగా నిలిచింది.



ఉగాది కవిసమ్మేళనంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి(ఫైల్)

**సాహితీ సౌరభాలు**

అనేక తెలుగు భాషా సాహితీవేత్తల రచనలను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. వారి సాహితీ సౌరభాల పరిమళాలను నలుదిశలా వ్యాప్తి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 120 మంది తెలుగు కవులు, రచయితల చిత్రపటాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.



మేడే ఉత్సవాల్లో పురస్కారం అందుకుంటున్న సాహితీ స్రవంతి అధ్యక్షుడు ఫ్రాన్సిస్

ఇతర సాహితీ సంస్థలతో మమేకమవుతూ మానవత్వాన్ని మించిన మతం మరొకటి లేదని చాటుతున్నారు. కవి సమ్మేళనాలు నిర్వహించడం, పుస్తక సమీక్షలు, ఔత్సాహిక రచయితలను పరిచయం చేయడం, ఉత్తరాంధ్ర సాహితీ వీచికలు పేరుతో రచయితలతో ఇష్టాగోష్టి నిర్వహించడం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నారు. ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం, పాడేరు ఏజెన్సీలోని బాక్సైట్ తవ్వకాలపై వ్యతిరేకంగా గిరిజనుల పోరాటానికి మద్దతుగా జన కవనాలు జరిపారు.

**రాజ్యాంగ విలువలు కాపాడాలి**



మన రాజ్యాంగం గురించి చాలా మందికి తెలియదు. రాజ్యాంగ విలువలు కాపాడేందుకు యువ చైతన్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. దాతల సాయంతో విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయాలని నిర్ణయించాం. ప్రతి ఏడాది శ్రీశ్రీ వర్ధంతి నిర్వహిస్తూ ఆయన రచనలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం.

– పెంటకోట రామారావు, కన్వీనర్, సాహితీ స్రవంతి

**ప్రముఖుల జాబితాలో చేర్చాలి**



ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన తెలుగు ప్రముఖుల జాబితాలో సంఘ సంస్కర్తలైన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు, గుర్రం జాషువాల పేర్లు లేకపోవడం బాధాకరం. వీరి పేర్లు కూడా జాబితాలో చేర్చాలి. మన మాతృభాష తెలుగు వెలగాలంటే అది ఇంటి నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా తెలుగు నేర్పించి సాహిత్యం వైపు ప్రోత్సహించాలి.

– పొలమరశెట్టి ఫ్రాన్సిస్, అధ్యక్షుడు, సాహితీ స్రవంతి

## వైభవం.. ఎర్నిమాంబ జాతర మహోత్సవం



ఎర్నిమాంబకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



స్వచ్ఛ సభ్యులు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణ ప్రారంభిస్తున్న ఈవో సురేష్‌బాబా

- ఘనంగా అనుపోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం-అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాన్ని ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము 4 నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర



ఆలయం వద్ద భక్తుల సందడి

ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు, సుమారు 260 అమ్మవారి ప్రతిమలను తలపై పెట్టుకుని వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, ఆర్కెస్ట్రా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయ సిబ్బంది, ఆలయ చైర్మన్ లండా రమణ, కమిటీ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి రూ.లక్ష విరాళం



డాక్టర్ ఉమామహేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ హాస్పిటల్ వ్యవస్థాపక ట్రస్టీ, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఎ.ఎస్.ఎన్.ప్రసాద్ తన పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేశారు. లయన్స్ క్యాన్సర్, జనరల్ హాస్పిటల్ అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కును ఆదివారం ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వి.ఉమామహేశ్వరరావుకు ఆయన అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమామహేశ్వరరావు ప్రసాద్ ఉదార సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఆయన తన వందో పుట్టిన రోజును శ్రేయోభిలాషులందరి మధ్య ఆయురారోగ్యాలతో జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

## నల్లి ధర్మారావుకు ఆచార్య చందు సాహితీ పురస్కారం

సీతంపేట: ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్టు ఏటా అందిస్తున్న సాహితీ పురస్కారం ఈ ఏడాది శ్రీకాకుళానికి చెందిన రచయిత, జర్నలిస్టు నల్లి ధర్మారావుకు ప్రదానం చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన సభలో ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు చేతుల మీదుగా ఆయనకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడుతున్న వారిని గౌరవించడం గొప్ప విషయమన్నారు. నల్లి ధర్మారావుకు చందు సుబ్బారావు సాహితీ పురస్కారం ఇవ్వాలనే ఆలోచనే గొప్పదని, జీవితం సాఫల్యం కావాలంటే ఇటువంటి కార్యక్రమాలు చేయడమేనన్నారు. సభాధ్యక్షుడు ఆచార్య కె.ఎస్.చలం మాట్లాడుతూ దిగజారిపోతున్న తెలుగు భాష గురించి కృషి చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సామాజిక న్యాయం, సాహిత్య అభివృద్ధికి పాటుపడుతున్న ధర్మారావుకు పురస్కారం ఇవ్వడం సముచితమన్నారు. ఆచార్య చందు సుబ్బారావు మాట్లాడుతూ సాహిత్యం, సైన్స్ మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు. ట్రస్టు కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ నల్లి ధర్మారావు రచనలు, సాహితీ



నల్లి ధర్మారావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు

కృషిని సభకు వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న ఉత్తరాంధ్ర సాహిత్య వైభవాన్ని విశదీకరించారు. నల్లి ధర్మారావు మాట్లాడుతూ చందు సుబ్బారావు హృదయాన్ని గెలవడం తన అదృష్టమన్నారు. తెలుగు భాషను భావజాల సమస్య నుంచి బయట పడేయాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబాటుతనం ఉన్న చోట తిరుగుబాటు ఉంటుందని చెప్పారు. ఆచార్య డి.వి.సూర్యారావు మాట్లాడుతూ చందు సుబ్బారావు రచనలు, చేసిన సాహిత్య విమర్శలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎస్.హనుమంతరావు, పి.ఎ.రాజు, బసుపోతన, హరి వెంకటరమణ, గరిమ నరసింహ పాల్గొన్నారు.

## రామలింగేశ్వరుడికి పుష్పోత్సవం



పుష్పోత్సవంలో రామలింగేశ్వరుడు

సీతంపేట: శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయంలో జరుగుతున్న పార్వతీ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. గర్భగుడిలోని స్వామివారిని, పార్వతీ, రామలింగేశ్వరుల ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ఉయ్యాలలో పవలింపు సేవ జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించి తరించారు. ఆలయ ఈవో జి.వి.రామభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు

మద్దిలపాలెం: న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో విశాఖ నుంచి ఇద్దరికి చోటు లభించిందని ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలోని సాయిసంతోష్ టైలర్స్ షాప్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా నియామకమైన ఇమంది త్రినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన షేక్ రసూల్‌కు సత్యనారాయణ నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా త్రినాథ్, రసూల్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా అసోసియేషన్‌కు చేస్తున్న సేవలను గుర్తించి తమకు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఎప్పటిలాగే టైలర్స్‌కు అందుబాటులో



త్రినాథ్, రసూల్‌లకు నియామక పత్రాలు అందిస్తున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఉంటు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారులు టి.పుల్లయ్యనాయుడు, విశాఖ జిల్లా కోశాధికారి వై.గౌరీశంకర్, షేక్ ఇమామ్, పి.లక్ష్మీనారాయణ, ఆచారి ముత్యాలరావు, లక్ష్మి, ఇ.భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కిశోర్‌కుమార్ మృతదేహం



ప్రమాదంలో నుజ్జయిన స్కూటీ

అరిలోవ: జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్‌ఐ రాందాసు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలేనికి చెందిన తిప్పాడ కిశోర్‌కుమార్(32) సోఫా సెట్లు కుట్టే పనిచేస్తుంటాడు. అతడు అవివాహితుడు. ఏదో పనిమీద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరం నుంచి ఎండాడ వైపు స్కూటీపై బయలుదేరాడు. ఎండాడ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకొని కొంత దూరం వెళ్లిన తర్వాత డివైడర్‌ను ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. అదే సమయంలో మధురవాడ వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిపై నుంచి దూసుకుపోయింది. దీంతో కిశోర్‌కుమార్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. అతను నడిపిన స్కూటీ నుజ్జయింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాందాసు తెలిపారు. సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## దేవీపురంలో ముగిసిన శ్రీవిద్య శిక్షణ

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించిన శ్రీవిద్య మిడ్‌లెవెల్ కోర్సు ఆదివారంతో ముగిసింది. ప్రాథమిక స్థాయి శిక్షణ పూర్తి చేసుకుని, వచ్చిన దేశ, విదేశాలకు చెందిన శ్రీవిద్య ఉపాసకులను ఈ శిక్షణ ఆనంతరం గురుమాత అన్నపూర్ణమ్మ ఆశీర్వదించారు. కుల మత భేదాల్లేకుండా ఇటువంటి బ్రహ్మ విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలన్న ఆలోచనతో నేర్పిస్తున్న ఈ విద్య ఎక్కడికి వెళ్లినా, వారితో పాటు అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శిక్షకురాలు కందర్ప రమ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర ప్రారంభం





శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరిట దేశమంతటా నిర్వహించనున్న పవిత్ర రథయాత్ర ఆదివారం విశాఖలో ఘనంగా మొదలైంది. పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవస్థాన ఆవరణలో రథయాత్రను సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు ప్రారంభించారు. అనంతరం శోభాయమానంగా సాగిన యాత్ర పోలమాంబ ఆలయం నుంచి శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమ సదన్ మందిరానికి చేరుకుంది. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 'అందరినీ ప్రేమించండి – అందరినీ సేవించండి' అనే సత్యసాయిబాబా సందేశానికి అనుగుణంగా భక్తులంతా ముందుకు సాగాలన్నారు. ఎదుటి వారికి హాని తలపెట్టకూడదనే భావన నిత్యం అందరిలోను ఉండాలన్నారు. ఐదు ప్రేమ ప్రవాహిని రథాలు దేశవ్యాప్తంగా 600కు పైగా జిల్లాల్లో 3 లక్షల కిలోమీటర్లు ప్రచారం నిర్వహించనున్నాయని తెలిపారు.

## జీఎస్టీ ఉద్యోగుల సైకిల్‌థాన్



సైకిల్‌థాన్‌లో పాల్గొన్న జీఎస్టీ ఉద్యోగులు

ఏయూక్యాంపస్: వస్తువులు, సేవల పన్ను(జీఎస్టీ) శాఖ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ ఉద్యోగులు సైకిల్‌థాన్ నిర్వహించారు. 'జీఎస్టీ-పన్నులను సరళీకరించడం, పౌరులను సాధికారపరచడం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫిట్ ఇండియా క్యాంపెయిన్‌తో అనుసంధానం చేస్తూ సైకిల్‌థాన్ నిర్వహించారు. సెంట్రల్ రెవెన్యూ క్వార్టర్స్ నుంచి ఆర్.కె బీచ్ మీదుగా పార్కు హోటల్ కూడలి వరకు ఈ సైకిల్ థాన్ కొనసాగింది. విశాఖ జోన్ కస్టమ్స్ సీజీఎస్టీ, సెంట్రల్ ఎక్సైజ్ కమిషనర్ సంజయ్ రాఠీ జెండా ఊపి సైకిల్‌థాన్ ప్రారంభించారు.